# గుర్రాలు

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

సృష్టిలో పనికిమాలిన వస్తువులేదు. ఎంతమాత్రమూ పనికిమాలని వస్తువుల్లో గుర్రం ఒకటి. "మై కింగ్‌డమ్ ఫర్ ఎ హార్స్!" ఒక్క గుర్రాన్నిస్తే నా రాజ్యమంతా ఇచ్చేస్తానన్నాడొకడు. వాడి రాజ్యంలో గుర్రాల్లేవు కాబోలు. అదీ కాక వాడి రాజ్యంకూడా అట్టే పెద్దది కాకపోవచ్చు. పెద్దది అయితే ఓ గుర్రమన్నా లేకుండా ఉంటుందా?

ఒక్క గుర్రానికే రాజ్యం ధారపోస్తానన్నవాడు గుర్రం విలవ బాగా పసికట్టాడు. వాడికి రేసుల మర్మంకూడా తప్పక తెలిసుండాలి. "కలమా, కత్తియా?" అంటే కత్తియే నన్నట్టు "రాజ్యమా, గుర్రమా?" అంటే తప్పకుండా గుర్రమే. అంచేత రెండూ ఉంటే కాదనాలని ఎక్కడుందీ?...ఈనాటి మహారాజులకి బలం గుర్రాలే!

వెనకటి మహారాజులు గుర్రాలమీద ఎక్కి స్వారీచేసేవాళ్ళు, యుద్ధరంగానికి వెళ్ళేవాళ్ళు. కాలంమారి, సంఘం పరిణామంచెంది ఈ కాలపు మహారాజులు యెక్కటానికి రోల్సురాయిసు లుంచుకుని నిక్షేపంగా గుర్రాల్ని పరిగెత్తిస్తున్నారు. లక్షలార్జిస్తున్నారు, చేదా?

సంవత్సరానికి లక్షరూపాయల ఆదాయంకూడా లేని రాజ్యాలు గెలిచేటందుకు వెనకటి మహారాజులు యెన్నో గుర్రాలను యుద్ధరంగంలో బలిచేసి హైరాన పడేవాళ్ళు, ఇప్పుడు మంచి గుర్రాలు నాలుగుంటే ఏటా ఒకలక్ష చేసి పెడతై.

ప్రపంచమంతా సోషలిజం గురించీ, రష్యా గురించీ మాట్లాడుతుంటే మనకీ మహారాజుల గొడవా వాళ్ల గుర్రాల గొడవా దేనికని సందేహం కలగవచ్చు. అదే మనవి చేస్తున్నాను. ఇక్కడ సోషలిజంకూడాఉంది. ఆ మహారాజుల గుర్రాలు మన గుర్రాలే. అవి మనకూ డబ్బిస్తాయి.

"ఏమోయ్ నువు దేనిమీద వేస్తున్నావ్?"

"త్రిపాదిమీద వేద్దా మనుకుంటున్నానోయ్."

"ఇంకేం? వెయ్యి! అది నా గుర్రమే."

మన జీవితంలో సోషలిజం ప్రారంభమయిందే గుర్రాల దగ్గిర, అని నేను ప్రపంచానికి ఢంకా బజాయించి చెబుతున్నాను. ఈ స్పిరిట్ క్రమంగా వ్యాపిస్తే ఈకింది సంభాషణలుకూడా జీవితంలో సాధ్యమవుతై.

"ఏమండీ, తమ రేపూట ఎక్కడ దేవతార్చన తల పెట్టారు?"

"అదుగో ఆ కనిపించే ఏడంతస్తుల మేడలో అడుగుదా మనుకుంటున్నాను."

"ఏరేం? తప్పక దయచెయ్యండి. అది మనిల్లే."

మన దేశంలో ఇంకా అంత సోషలిజం రాలేదు. కాని ఉన్నదాన్ని సద్వినియోగం ఎందుకు చెయ్యరాదూ? అంచేత గుర్రాలు పరిగెత్తేచోటికి పోదాం పదండి.

రోజుకిన్ని రేసులని ఉంటై. ప్రతి రేసులోనూ కొన్ని గుర్రాలు పరుగెత్తుతై. పరిగెత్తబోయే గుర్రాలు ముందుగా మనకు చూపిస్తారు. అశ్వలక్షణం తెలిసినవాళ్ళు—నలమహారాజులు—వెంటనే గెలవబోయే గుర్రాన్ని పసి పట్టేస్తారు.

అందుకని అశ్వలక్షణాలమీద గ్రంథాలు కొని చదవటం మొదలుపెట్టేరు. ఎంచేతనంటే ఈనాటి పందాల్లో గెల్చే గుర్రాలమీద ఎక్కువ బరువువేసి వాటిని గెలవనీకుండా చేసే ఆచారంఉంది. అందుచేత నలమహారాజు ఈనాటి రేసులకు వెళ్ళాడో పాచిక లవసరంలేకుండానే తిరుక్షవరమై మళ్ళీ అడువులపాలు కావలిసొస్తుంది.

పోతే గెలిచే గుర్రాన్ని నిర్ణయించేటందుకు జాకీల పేర్లుంటై. కొందరు బుద్ధిమంతులు తమకు నచ్చిన జాకీని పట్టుకుని గెలిచేదాకా వాడిమీద డబ్బు కుమ్మరిస్తూ ఉంటారు. వీళ్లు ఓవందో రెండొందలో పోగొట్టుకున్నతరవాత ఏదో పన్నెండో తప్పక సంపాయిస్తారు.

గుర్రాలమీద అంకెలుంటై. వీటివల్ల లాభం ఏమిటంటే గుర్రం పేరుకు బదులుగా దాని అంకెమీద మనం డబ్బు వెయ్యవచ్చు. గెలిచిన గుర్రం అంకె బోర్డుమీద పెడతారు.

కాని ఈ అంకెలవల్ల మరో పరమ ప్రయోజనం ఉంది. న్యూమరాలజీ అనే శాస్త్రంద్వారా ఏ అంకె బోర్డుమీది కెక్కుతుందో తెలుసుకోవచ్చు. అయితే ఈ న్యూమరాలజీ అనే శాస్త్రం ఇంకా చాలా బాల్యదశలో ఉంది. అంచేత

దీనివల్ల ప్రజలకి కలగదగినంత ప్రయోజనం కలక్కుండా ఉంటున్నది.

దీని వైనం నాకు బాగా తెలీదు. నేను గ్రహించినంత వరకు సంగ్రహంగా చెబుతాను. ఇందులో చాలా పద్ధతు లున్నై.

(1) ఆరోజు (అనగా రేసు జరిగేరోజు) తారీకు తీసు కోండి, నెల తీసుకోండి, సంవత్సరం తీసుకోండి, రేసు సంఖ్య తీసుకోండి, గుర్రం అంకె తీసుకోండి, దానిమీద ఉండే బరువు తీసుకోండి. వాటికేసి కాస్సేపు చూసి మీ యిష్టం వచ్చిన అంకె ఒకటి మనస్సులో అనుకుని దానిమీద టిక్కెట్టుకొనండి, అది రాదు.

(2) మీ పేరులో ఉన్న అక్షరాల సంఖ్యకు ఏ గుర్రం సంఖ్య సరిపోతుందో చూడండి. దాని బరువు సంఖ్యకు మళ్లీ ఏ గుర్రం అక్షరాల సంఖ్య సరిపోతుందో చూడండి. దాని బరువు సంఖ్య చూసి దానికి తిథి సంఖ్యకలిపి ఆ సంఖ్యమీద డబ్బు వెయ్యండి, అది రాదు.

(3) మీరు రేసుకు బయల్దేరేటప్పుడు ఏబస్సు ఎక్కు తారో, బండీఎక్కుతారో, రైలెక్కుతారో అన్నిటి సం ఖ్యలూకలిపి ఆ వొచ్చిన మొత్తానికి ఆయా రేసుల్లో పరిగెత్తే గుర్రాల సంఖ్యలుకలుపుకుంటూ, అట్లా వచ్చిన సంఖ్యలమీద డబ్బువేస్తూ వెళ్లండి, అవేవీ రావు.

షరా: అన్ని సంఖ్యలనూ ఏక సంఖ్యకింద మార్చు కునేది.

ఈ విధంగా న్యూమరాలజీ పద్ధతులు చాలా ఉన్నాయి. కాని అవన్నీ చెబితే మీ కెట్లాగూ జ్ఞాపకం ఉండదు.



“ మాయలోకం ”లో-యం. వి. రాజమ్మ

రేసులో డబ్బు వేసేటందుకు ఇంకా చాలా పద్ధతు లున్నై. అవికూడా సంగ్రహంగా చెబుతాను.

ఏ ఒకటో నంబరో రెండో నంబరో పట్టుకుని అది గెలిచే దాకా ఆడటం. ఇది చాలా సులభంగా కనిపించవచ్చుగాని నిజంగా తేలికకాదు. ఎందుకంటే ఇది పోయిన కొద్దీ రెట్టింపు వడ్లగింజల లెక్క. ఆవిధంగా ఆడుతూ పోగా ఎప్పుడో మన నంబరు వచ్చినప్పుడు అదిచ్చే డబ్బుతో మన నష్టమంతా పూడుతుంది, లాభం మాట దేవుడెరుగు.

మన డబ్బు మన దగ్గిరే ఉండటానికి ఇంత హైరాన దేనికని కొందరనవచ్చు. ఇది చాలా పొరబాటు. మనడబ్బు మనకొస్తే చాలుననే సూత్రంమీద సినిమాలు తియ్యటం లాంటి ఎంతేసి మహత్తర, హైరాన జనక కార్యాలు జరుగు తున్నాయో తెలిసినవాళ్లు అలాంటి పొరబాటు పడరు.

ఈ పద్ధతికి నేనూ ఒప్పుకోను. నా అభ్యంతరం ఏమి టంటే ఈ పద్ధతి పని చెయ్యాలంటే పెట్టుబడి జాస్తి కావాలి. అంత డబ్బే ఉంటే నేనయితే ఓ గుర్రాన్నే కొనేస్తాను.

కొంతమంది టోటుచూసి టిక్కెట్లు కొంటారు. ఇం దులో రహస్యం ఏమిటంటే యెక్కువ టిక్కెట్లున్న గుర్రం గెలిస్తే తక్కువ డబ్బిస్తుంది. తక్కువ టిక్కెట్లున్న గుర్రం గెలిస్తే ఎక్కువ డబ్బిస్తుంది. తక్కువ డబ్బుతో సంతృప్తి పడేవాడు ఎక్కువ టిక్కెట్లున్న గుర్రంమీద కొని పోగొట్టుకుంటాడు, చాలా డబ్బు కావలిసినవాడు ఎవరూ కోరని గుర్రంమీద వేసి పోగొట్టుకుంటాడు. రెండు పద్ధ తులూ మంచివే.

రేసింగుయొక్క అసలు మర్మం తెలిసిన పెద్దమనిషి ఒకతనున్నాడు. అ త న్ని గు రిం చి చెప్పి, ఈ ముచ్చట ముడేస్తాను.

అతను ప్రతి రేసులోనూ రెండేసి గుర్రాల పేరు రాసు కుని రేసుకుపోయి హాయిగా కూచుని చూస్తాడు. గెలిచిన గుర్రాలు గుర్తు పెట్టుకుంటాడు. ఇంటికి వచ్చేటప్పుడు ఎరి గినవాళ్లు కనిపించి ఏమయిందని అడిగితే, “నా గుర్రాలు రెండు ప్లేసులొచ్చినై. ఫరవాలేదు, నా డబ్బు నా కుంది!” అంటాడు.

మిగిలిన వాళ్లంతా అతన్ని చూసి అసూయపడతారు.